మినీ కథ

# ప్రేమిస్తే పెళ్ళవుతుందా?

'అశాంత్'



"ఎక్కడికే ముస్తాబవుతున్నావు?" జడ వేసుకుంటున్న కూతుర్ని కటువుగా ప్రశ్నించింది పార్వతి.

"కాలేజీకి" నిర్లక్ష్యంగా సమాధానం చెప్పింది సౌమ్య.

"ఏవిటా తలబిరుసు? ఇవాళ పెళ్ళివారు వస్తున్నారు కాలేజీకి సెలవు పెట్టమని చెప్పలేదూ !"

"......"

"ఏం మాట్లాడవేం?"

"అబ్బబ్బ నన్ను చంపకమ్మా. ఆ బేరగాళ్ళు వచ్చేది సాయంత్రం కదా ! అంతవరకు ఇంట్లో ఊరికే కూర్చుండడం దేనికి? సాయంత్రం కాలేజీనుంచి త్వరగా వస్తాలే."

"వదవేస్తే వున్నమతి పోయినట్టు పెళ్ళి చూపులకు వచ్చే వాళ్ళని బేరగాళ్ళంటా వేమిటే !"

"కాకపోతే ఏమిటి? వస్తువుల్నో, జంతువుల్నో పరీక్షించినట్టు పరీక్షించడం-తరవాత కట్నాలు, కానుకలూ అంటూ బేరమాడడం-ఇంతేకదా పెళ్ళి చూపులంటే..."

పక్కగదిలోంచి తల్లీ కూతుళ్ళ సంభాషణని వింటున్న నారాయణరావు మధ్యలో కల్పించుకుని "పార్వతీ! అమ్మాయిని కాలేజీకి వెళ్ళనీరాదూ, సాయంత్రం త్వరగానే వస్తానంటోందిగా" అన్నాడు.

పార్వతి విసురుగా భర్తముందుకు వచ్చి "మీరిట్లా ప్రతిదానికీ వెనకేసుకొస్తుండబట్టే అది మొండిగా తయారవుతోంది. ఆడపిల్లకు అణుకువ నేర్పకపోతే తండ్రినేమీ అనరండీ-కన్న తల్లిని 'ఆడిపోసుకుంటారు!" తన ఉక్రోషాన్ని వెళ్ళగక్కి వంటింట్లోకి వెళ్ళిపోయింది.

తండ్రికి కృతజ్ఞతలు చెప్పుకుని మెల్లిగా ఇంటినుంచి బయట పడ్డది సౌమ్య.

సౌమ్యకి తన ఇంటి పరిస్థితి పూర్తిగా తెలుసు. తండ్రి రిటైరైన బడి పంతులు. ఆయన కొచ్చే పెన్షన్, ఆయన చెప్పే ట్యూషన్లు తప్ప వేరే ఆదాయం ఏమీ లేదు. ఇద్దరు అక్కయ్యల పెళ్ళిళ్ళు. అప్పటికే చేసి వుండటంతో వున్న కొద్దిపాటి ఆస్తిపాస్తులు తుడిచి పెట్టుకు పోయాయి. ఇంకా తనూ, తన చెల్లెలు ఇప్పుడు పెళ్ళికెదిగి వున్నారు. చెల్లెలికి మేనరికం వుంది కాబట్టి దాని పెళ్ళి పెద్ద సమస్య కాదు. కాని మేనరికమే కదా అని బావామరదళ్ళు తొందరపడడంతో చెల్లెలికి నెల తప్పింది. ఇక ఏమాత్రం పెళ్ళి వాయిదా వేయలేని పరిస్థితి. చెల్లెలి పెళ్ళి కావాలంటే ముందు తన పెళ్ళి కావాలి. అందుకే ఈ హడావిడి.

తనేమో తన క్లాస్‌మేట్ రమేష్‌ని ప్రేమిస్తోంది. పెద్దలతో చెబుదామంటే తమిద్దరిది ఒకే కులం కాదు! కులాంతర వివాహాలకి పెద్దలు ఎప్పుడూ వ్యతిరేకమే. అందుకే చదువు పూర్తయ్యే వరకు పెళ్ళి మాట తలపెట్ట కూడదనుకున్నారు. స్వంత కాళ్ళమీద నిలబడగల ఆర్థిక స్తోమత వుంటే ఈ కులగోత్రాలు, ఈ కట్టు బాట్లూ ఏమీ చేయలేవు. కాని—

చెల్లెలు చేసిన పనికి తన భవిష్యత్తు అయోమయంలో పడింది. ఏదో ఒక నిర్ణయం తీసుకోక తప్పదు. తను కాలేజీకి బయలు దేరింది కూడా అందుకే.

పరిపరి విధాల ఆలోచిస్తూ నడుస్తున్న సౌమ్య రిక్షాలో వెడుతున్న రమేష్‌ని చూసి స్టన్ అయింది. వెదకబోయిన తీగ కాలికి తగలడం అంటే ఇదేనేమో! రమేష్ ప్రక్కన మరో వ్యక్తి కూర్చుని వున్నాడు. అయినా లక్ష్యపెట్ట లేదు ఆమె.

"రమేష్...రమేష్..." ఉద్వేగంగా పిలుస్తూ రిక్షా వెనకే గబగబా నడిచింది.

ఆమె కేకలకు రిక్షాలో కూర్చున్న ఇద్దరూ వెనక్కి తిరిగి చూశారు. కొంచెం దూరం వెళ్ళి ఆగింది రిక్షా. అందులోంచి దూకుడుగా దిగి గబగబా వెనక్కి వచ్చాడు రమేష్.

"ఏమిటి? నడిరోడ్డుమీద ఏమిటా గావుకేకలు?!" కళ్ళెర్ర జేస్తూ ఉరిమినట్టు అన్నాడు అతను.

"అదికాదు రమేష్...నేనూ...నాకూ..." తన ప్రేమికుడిలో ఎన్నడూ చూడని ఆ కోపానికి తత్తరపడి పోయింది సౌమ్య. మరోవైపు పరుగెత్తినందుకు ఆయాసంగా ఉంది.

"షటప్. రోడ్డుమీద ఏమిటీ న్యూసెన్స్? అవతల రిక్షాలో కూర్చున్నది మా నాన్నగారు! రేపు సాయంత్రం పార్క్కు వస్తాను అప్పుడు వినిపిద్దువుగాని నీ ఏడుపు. ఇప్పుడు ఏమీ యాగీ చెయ్యకు" అంటూ వచ్చినంత దూకుడుగానూ వెళ్ళిపోయాడు రమేష్.

అతని ప్రవర్తనకి నిర్ఘాంత పోయింది సౌమ్య. ఒక క్షణం చేష్టలుడిగిన దాన్లా అలాగే నిలుచుండి పోయింది. తరవాత నీరసంగా ఇంటిముఖం పట్టింది.

ఆ రోజు సాయంత్రం యథావిధిగా పెళ్ళి చూపుల తతంగం జరిగింది. అబ్బాయి పేరు శ్రీకాంత్ అట. బ్యాంకులో ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడట. నిర్లిప్తంగా అతని వైపు చూసింది సౌమ్య. 'హేండ్సమ్‌గానే వున్నాడు' అనుకుంది. కాని ఆమె ఊహలనిండా రమేష్ మెదులు తున్నాడు.

శ్రీకాంత్‌కి సౌమ్య నచ్చిందిట. సౌమ్య నమ్మకాలకు విరుద్ధంగా అతను కట్నాలు-కానుకలూ ఏమీ వద్దన్నాడు. పైగా పెళ్ళికూడా ఆడంబరాలేమీ లేకుండా సింపుల్‌గా జరగాలన్నాడు.

దాదాపు ఈ సంబంధం ఖాయమైనట్టే. సౌమ్య తల్లి తండ్రుల సంతోషానికి అంతే లేదు. "ఏమ్మా! అబ్బాయి నీకు నచ్చినట్టేనా?" అని తండ్రి యధాలా పంగా అడిగితే బలవంతంగా గొంతు పెగుల్చుకుని "మీ ఇష్టం నాన్నగారూ!" అంది సౌమ్య.

పైకి అలా అంది కాని ఆమె మనసంతా ఈ సంబంధం తప్పిపోవాలని తహతహలాడసాగింది. ఎలాగైనా ఈ పెళ్ళి ఉచ్చులోంచి బయట పడాలి. రమేష్‌ని కలిసి ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలి. ఎలా ఎలా అని తల బ్రద్దలు కొట్టుకుంటున్న సౌమ్యకి తటాలున ఒక ఐడియా తట్టింది. వెంటనే కలం కాగితం తీసుకుని ఇలా రాసింది:

డియర్ ఫ్రెండ్!

సౌమ్యని వివాహం చేసుకుంటే దగా పడతావు. సౌమ్య క్యారెక్టర్ మంచిది కాదు. ఆమె పేరు ఆమె క్లాస్‌మేట్ రమేష్ పేరు కాలేజీ గోడలమీద కెక్కాయి. ఆ తర్వాత నీ ఇష్టం..

ఇట్లు
మీ శ్రేయోభిలాషి

ఎవ్వరి కంటా పడకుండా పక్కింటి అబ్బాయిచేత ఆ ఆకాశరామన్న ఉత్తరాన్ని పెళ్ళి చూపులు ముగించు కుని వెడుతున్న శ్రీకాంత్‌కు అందజేసి ఇక ఈ గండం గడిచినట్టే అని హాయిగా ఊపిరి పీల్చుకుంది సౌమ్య.

మర్నాడు సాయంత్రం తనూ, రమేష్ తరచు కలుసుకునే పార్క్‌కు వెళ్ళింది సౌమ్య. తాము ఎప్పుడూ కూర్చునే స్థలంలో కూర్చుని రమేష్ రాకకోసం ఎదురు చూడసాగింది. తను ఏ పరిస్థితిలో నిన్న అలా రోడ్డు మీద పడ్డదో తెలిస్తే రమేష్ తన ప్రవర్తనకు నొచ్చుకుని క్షమాపణ అడుగుతాడని, కుదిరిన పెళ్ళి సంబంధం చెడగొట్టేందుకు తను చేసిన పనికి అతను మెచ్చు కుంటాడని ఏవేవో ఊహించుకోసాగింది సౌమ్య.

ప్రక్కన ఎవరిదో నీడ పడేసరికి ఉలిక్కిపడి వెను తిరిగి చూసింది.

వచ్చింది రమేష్ కాదు శ్రీకాంత్!

అతన్ని చూసి అదిరిపోయింది సౌమ్య.

"రమేష్ కోసం ఎదురు చూస్తున్నారా?" నవ్వుతూ అన్నాడు అతను. ఆ ప్రశ్నకి మరింత బిత్తరపోయింది ఆమె.

"నేను వాళ్ళింటి దగ్గర్నుంచే వస్తున్నాను. ఈ ఆదివారమే అతని పెళ్ళట. బిజీగా వున్నాను రాలేనని చెప్పమన్నాడు. ఇదిగో ఈ ఇన్విటేషన్ మీకు ఇవ్వమన్నాడు" అంటూ ఓ శుభలేఖ ఇచ్చాడు శ్రీకాంత్.


వణుకుతున్న చేతులతో అందుకుంది సౌమ్య.

అది రమేష్ వెడ్డింగ్ కార్డే! వధూవరుల పేర్లతో పాటు అనుమానం లేకుండా ఫోటోలు కూడా అచ్చు వేయబడి వున్నాయి అందులో!!

ఒక్కసారి కళ్ళు బైర్లు కమ్మినట్టయింది సౌమ్యకు. ●

ఒకడు తన తల్లి స్తనాల కోసం
ఆరాట పడుతున్నాడు
తన కడుపు కోత తీర్చుకోవడానికి
మరొకడు తనవి కాని స్తనాల కోసం
ఆరాటపడుతున్నాడు
తన కామ వాంఛ తీర్చుకోవడానికి
మొదటివాడు శిశువు
రెండవ వాడు పశువు

-సత్రం మల్లేశ్వరరావు



సీరియల్

# ఆపదలో అనూరాధ

## ఎం.డి. సౌజన్య

మునసబు తమ్ముణ్ణి బుల్లెబ్బాయ్ - అంటూ మంగపతి పిలుస్తుంటాడు.

"ఇక బుల్లెబ్బాయ్...... మంగపతివల్ల నా వ్యాపారం ఏ విధంగానూ కోలుకోలేదు. ఇక నీ సత్తాచూడాలి.

"ఖర్చు నేను చూసుకుంటాను ముందు ఆ ప్రభాకర్ సంగతి, ఆ అనూరాధ సంగతీ కాస్త గట్టిగా పట్టించుకో?!" అన్నాడు వరదయ్య ఓ వెయ్యి చేతిలోపెట్టి.

మునసబు తమ్ముడు ఆ డబ్బు అందుకుని జేబులో పెట్టుకుని "నా చేతి మాత్ర వైకుంఠ యాత్రే! చూస్తారుగా!" అన్నాడు. తన ప్రతిభను నిరూపించుకుంటేనే గాని, తనకు భవిష్యత్తు లేదని - బ్యాంకు పని, బ్యాంకు అధికారులపని గట్టిగా పట్టాలని నిర్ణయించుకున్నాడు, మునసబు తమ్ముడు, ఓ పథకం వేసి.

ఇంతలో కరపత్రస్వామి న్యూస్ పేపర్లు తెచ్చి, అక్కడున్న వాళ్ళకు తలావొక టిచ్చి "ఆజ్ కి తాజా ఖబర్...... ఆజ్ కి తాజా ఖబర్......"అంటూ అరవ సాగాడు.

ఆ పేపరులో చేతికి బేడీలతో జీప్ ఎక్కుతున్న మంగపతి ఫోటో, క్రింద అతని వివరాలతో బాక్స్ కట్టివున్న మేటర్ చూసిన హెూకడిపో మంగయ్య వులిక్కిపడి "అయ్యో!మంగపతి ఫోటో పెద్దక్షరాలతో పేపర్లో వేశారండి!" అన్నాడు, జైల్లో పడ్డా, ఫోటో పడిందన్న అసూయతో.

"రేపు నీ ఫోటో, ఎల్లుండి ఈయన ఫోటో, ఆవులెల్లుండి ఆయన ఫోటో తెలుగు పత్రికల్లో సీరియల్స్‌లా రాబోతున్నాయి! అలపించిన ఆశాభంగం! తాజావార్తల కోసం మీ కాపీని ఏజంటు వద్ద నేడే రిజర్వ్ చేసుకోండి!" అన్నాడు కరపత్రస్వామి.

"ఇదిగో ... కరపత్రస్వామి......!! నువ్వు వెళ్ళు!" కాస్త కోపంగా అన్నాడు మునసబు తమ్ముడు.

కరపత్రస్వామి "ఇతను ఎలా వెళతాడు...!! లోకసత్యాలు కొన్ని చెప్పికాని పోడు!! ఇదిగో వినాయకులూ వినండి! లోకంలో కొందర్ని కొన్నాళ్ళు, అందర్నీ కొన్నాళ్ళు మోసం చేయగలరు కాని అందరినీ అన్నాళ్ళూ మోసం చేయలేరు. సరే, దేవుడి మాన్యం భోంచేయటానికి పెత్తనం నాకంటే నాకు అంటూ మంగపతి ముగ్గురు కొడుకులూ తన్నుకుచస్తున్నారు. కాబోయే ఎమ్మెల్లేవి ఆ తగవులాట కాస్త తీర్చకూడదూ?" అన్నాడు మునసబు తమ్ముడితో.

"ఏమిటీ! తండ్రి కటకటాల వెనక పడివుంటే, ఆయన సంగతి పట్టించుకో కుండో... ఈ పిల్లలు దేవుడి మాన్యం మీద పెత్తనం కోసం తన్నుకుంటున్నారా!" అన్నాడు మంగయ్య ఆశ్చర్యంగా.

"వాళ్ళు ఆస్తికోసం, దేవుడిమాన్యం కోసం తన్నుకుంటే పర్వాలా! రేపు ఎలక్షన్లలో ఎమ్మెల్లేగా నిలబడేది ఎవరో తేల్చుకోవాలని కూడా పట్టుబడుతున్నారు" అన్నాడు కరపత్రస్వామి, అక్కడి నుంచి నిష్క్రమిస్తూ.

ఆ మాటలతో సంచలనం కలిగిన మునసబు తమ్ముడు "ఓరి వీళ్ళ అఘాయిత్యం పాడుగానూ! వెధవలు వేలెడంత లేరు... అప్పుడే వీళ్ళ కింత పేరాశా? ఇదేమన్నా ఢిల్లీ సింహాసనమనుకున్నారా... వంశపారం పర్యంగా పీట వేసుకు కూర్చోడానికి! ప్రజాప్రతినిధంటే చదువుకి, వయస్సుకి సంబంధించిన రూల్సు కాస్త సడలింపు పట్టిందేమో కాని... తక్కిన క్వాలిఫికేషన్లు ఓట్లిచ్చేవారు ఎంత పట్టిపట్టి చూస్తారో వీళ్ళకేం తెలుసు!! అయినా మంగపతి ఏం మంచి పనులు చేశాడని వీళ్ళకు జనం ఓటేస్తారు? ఆ బ్యాంకు ప్రభాకర్ చేసే ప్రతి మంచి పనికి ఎదురు చేయటమేగదా?" అన్నాడు కోపంగా, తనూ అక్కడి నుంచి వెళ్ళిపోతూ.

"ఇదేమిటి బాబూ, మంగపతితో అంత స్నేహంగా వున్న మునసబు తమ్ముడు గారు... ఇలా నిముషాల్లో మారిపోయారు! కొంపతీసి ఈయన ఆ ప్రభాకర్ పక్షం చేరదు కదా!?" అన్నాడు అనుమానంగా, హెూక డిపో మంగయ్య.

"ఏం చెప్పగలం! మంగపతి తరువాత ఎమ్మెల్లే అవాలని అతని తోకలా తిరిగాడీ బుల్లెబ్బాయి! ఇప్పుడు మంగపతి అడ్డు తొలిగే సరికి తనే ఎమ్మెల్లేగా వుండాలని తాపత్రయం ఎక్కువైంది!" అన్నాడు వడ్డీల వరదయ్య.

"మంగపతిగారి సంగతి మీరన్నా కాస్త పట్టించుకోండి పాపం... బాగా బతికినోడు" అన్నాడు మంగయ్య బాధగా.

### జరిగిన కథ

పోలీసులు బందిపోటు దొంగగా ముద్రవేసిన టైగర్ ప్రసాద్ అమూరాధ తండ్రి. చిన్నప్పటి నుంచీ ఆమెను స్వకుటుంబానికి దూరంగా, షెడ్యూల్డు కులాల, తెగల హాస్టల్లో వుంచి తాతయ్య చదివించాడు. ప్రతిభగల విద్యార్థినిగా ప్రశంసలతో పాటు అందమైన ఆడపిల్లగా అడుగడుగునా ఆపదల్ని ఆమె ఎదుర్కొనవలసి వచ్చింది. ఫీల్డాఫీసరుగా వేమూరు బ్యాంకుకు బదిలీ మీద వచ్చిన అనూరాధకు మేనేజర్ ప్రభాకర్‌తో చిన్ననాటి స్నేహం మళ్ళీ బలపడింది. కుటిల గ్రామ రాజకీయాలలో కీలక పాత్ర వహిస్తున్నది–మాజీ ఎమ్మెల్యే మంగపతి, మునసబు, వడ్డీల వరదయ్య బృందం. ప్రత్యర్థుల గమిడి గేదెలపై విష ప్రయోగం చేసిన పాలేరు పమిడయ్యను, అందుకు పురమాయించిన మంగపతిని పోలీసులు అరెస్టు చేశారు.. అనూరాధకు గాంధీ వెంకయ్య ఇల్లు అద్దెకు దొరికింది. ఆ ఊరు విడిచి వెళ్ళకపోతే ప్రభాకర్‌ని, ఆమెను హత్య చేయగలమని అనూరాధకి ఒక బెదిరింపు ఉత్తరం వచ్చింది. ప్రభాకర్‌పై దుండగులు హత్యా ప్రయత్నం చేశారు. బ్యాంకు ద్వారా దొంగనోట్లు చెలామణీ చేస్తున్న వ్యక్తుల్ని పట్టుకోవాలని వారిద్దరూ నిర్ణయించుకుంటారు.

ఆ ప్రకారంగానే అనూరాధకు క్షణక్షణం ప్రమాదాలు ఎదురవుతున్నాయి. దొంగనోట్ల సృష్టిలో శంకర్రావు హస్తం వున్నదన్న అనుమానం ఆమెకు కలిగింది. ఊళ్ళో మంగపతి స్థానాన్ని మునసబు తమ్ముడు ఆక్రమించాడు.

(ఇక చదవండి)